# కార్మిక కర్షక ఐక్యత

## నేటి పరిస్థితి

హన్నన్ మొల్లా

PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్

**ప్రథమ ముద్రణ** : సెప్టెంబర్, 2021

**ప్రతులు** : 3,000

వెల : ₹. 10/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,

ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

152280

# కార్మిక కర్షక ఐక్యత: నేటి పరిస్థితి

**- హన్నన్ మొల్లా**

1789లో జరిగిన ఫ్రెంచ్ విప్లవం, భూస్వామ్య వ్యవస్థను సమూలంగా నాశనం చేసి, ఆ స్థానంలో బూర్జువా ప్రజాస్వామ్యాన్ని స్థాపించింది. ఆలస్యంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడిన దేశాలలో కొత్తగా ఆవిర్భవించిన పెట్టుబడిదారులు ఫ్రెంచ్ విప్లవంలో మాదిరిగా భూస్వామ్య వ్యవస్థను నాశనం చేయలేకపోయారన్న గుణపాఠాన్ని అక్టోబర్ విప్లవం మనకు నేర్పించింది. కొత్తగా ఏర్పడిన పరిస్థితులలో, భూస్వామ్య వ్యవస్థలోని వనరులపై దాడి చేసినట్టయితే, తమ వనరులపై కూడా దాడులు జరిగే అవకాశాలున్నాయని పెట్టుబడిదారీ వ్యవస్థ భయపడింది. అందువల్ల కొత్తగా ఆవిర్భవించిన పెట్టుబడిదారులు భూస్వాములతో రాజీపడేందుకు సిద్ధపడ్డారు. అంటే, ఈ దేశాలలో భూస్వామ్య వ్యవస్థలోని రైతాంగాన్ని భూస్వాముల దోపిడీ నుండి విముక్తి చేసి, బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని స్థాపించే బాధ్యత కార్మిక వర్గంపై పడింది. ఇది చారిత్రిక వాస్తవమే అయినా ఇటువంటి పరిస్థితులు ఏర్పడ్డవి కొన్ని చోట్లే, ఏర్పడ్డది కూడా చాలా కాలం తరువాత. ఈ వాస్తవ పరిస్థితులు, కార్మిక వర్గ నాయకత్వంలో కార్మిక కర్షక ఐక్యతను ముందుకు తెచ్చాయి. అయితే భూస్వామ్య వ్యవస్థను నాశనం చేసి దాని స్థానంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని స్థాపించడం మొదలు పెడితే అది అక్కడితో ఆగదు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవం

పూర్తవగానే కార్మిక వర్గం సోషలిస్టు విప్లవం వైపు అడుగులు వేస్తుంది. ఒక నిరంతర విప్లవ ప్రక్రియ ప్రారంభమవుతుంది. కార్మిక కర్షక ఐక్యత ఫలితమిదే. భారతదేశ విప్లవకారులు ఈ పాఠాలను పూర్తిగా జీర్ణం చేసుకున్నారు. అందువల్ల అటువంటి ఐక్యత సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. అందువల్ల కార్మికులను కర్షకులు దేశంలోని వారి వారి సంఘాల ద్వారా కార్యక్రమాలను రూపొందించుకునేటట్టు చేసి, తద్వారా ఆయా సంఘాలలో వర్గ పోరాటాలు బలపరిచేట్లు చేస్తున్నారు. ప్రజాతంత్ర విప్లవాల ద్వారా భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, పెట్టుబడిదారి వ్యవస్థ వ్యతిరేక పోరాటాలను బలపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మూడు వైపుల నుండి చేసే పోరాటాలతో సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యం ఏర్పడుతుంది. కార్మికవర్గ ఐక్యత సాధ్యపడుతుంది. దశాబ్దాల తరబడి నిరంతరంగా చేసిన కార్మిక వర్గ పోరాటాలు, ఎనలేని త్యాగాలు, దేశంలో ప్రజాస్వామ్య ఉద్యమాన్ని నిర్మించాయి. ఈ మార్క్సిస్టు అవగాహనతోనే భారతదేశంలో కార్మిక వర్గం తన రాజకీయ శక్తిని నిర్మించుకుంది. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించింది. ఇది ప్రజలు ప్రజాతంత్ర ఉద్యమానికి నాయకత్వం వహించడానికి దారి తీసింది.

## కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) దృక్పథం

1964 ఏడవ మహాసభ ఆమోదించిన పార్టీ కార్యక్రమంలోని 100వ అధికరణంలో ఇలా ఉంది:

"జనతా ప్రజాతంత్ర వేదిక నిర్మాణం జరగాలంటే, విప్లవం విజయవంతం కావాలంటే, అది కార్మిక వర్గం ద్వారా, దానికి నాయకత్వం వహించే కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది.

**101 ప్రకరణం ఇలా ప్రకటించింది:**

"కార్మిక కర్షక ఐక్యతే జనతా ప్రజాతంత్ర వేదికకి కీలకం. ఈ ఐక్యత దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడడానికి, ప్రధానమైన, విస్తృతమైన పర్యవసానాలు గల ప్రజాతంత్ర వ్యవస్థ ఏర్పాటుకు, అన్ని వైపులా సామాజిక పురోగతి సాధించడానికవసరమైన భరోసానివ్వడానికి అత్యంత కీలకం."

2000 సంవత్సరంలో పార్టీ కార్యక్రమాన్ని నవీకరించినప్పుడు 7.5, 7.6 సెక్షన్‌లలో మార్పులు చేయలేదు. అంటే పైన పేర్కొన్న ప్రకటనలు మౌలికమైనవని, పార్టీ తన లక్ష్యాన్ని చేరుకునే వరకు, అంటే జనతా ప్రజాస్వామ్య విప్లవాన్ని సాధించే వరకు, మార్పులు చేయనవసరం లేనివని తెలియచేస్తుంది.

ఆ తర్వాత జరిగిన అన్ని పార్టీ రాజకీయ తీర్మానాలలోను, రాష్ట్రాలు, జిల్లాలు, ఆ కింది స్థాయి కమిటీలలో జరిగిన మహాసభల తీర్మానాలలోను కార్మిక, కర్షక ఐక్యతను గురించి దృఢంగా చెప్పడం జరిగింది. కానీ అవి కార్యరూపం దాల్చలేదు. సిద్ధాంతానికి పరిమితమయ్యాయి.

**ఈ నిర్ణయానికి రావడానికి గల రాజకీయ సైద్ధాంతిక మూలాలు:**

సామాజిక మార్పు కోసం, కార్మికవర్గ నాయకత్వాన పోరాటాలను నిర్మించాలి, దోపిడీ చేసే పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసే చారిత్రిక కర్తవ్యాన్ని నిర్వహించి దాని స్థానంలో సోషలిస్టు వ్యవస్థను నిర్మించాలి అనేది మార్క్స్-ఏంగిల్స్ విప్లవ సిద్ధాంతపు మౌలిక సూత్రం. ఈ మౌలిక సూత్రం ఆధారంగానే, కార్మికుల వర్గ పోరాటాల ద్వారా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సోషలిస్టు విప్లవ సిద్ధాంతం రూపొందించబడింది. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ అసమానంగా అభివృద్ధి చెందడం వలన గుప్పెడు దేశాలు బాగా అభివృద్ధి చెంది, భూస్వామ్య విదానం రద్దు అయి దాని స్థానంలో పెట్టుబడిదారీ విధానం ఏర్పడింది. అయితే అదే సమయంలో అక్కడ పెట్టుబడిదారీ వ్యవస్థను అంతం చేయబోయే ఒక కొత్త విప్లవకర నాయకత్వం కూడా ఉద్భవించింది. మరో వైపు ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో భూస్వామ్య వ్యవస్థ కొనసాగుతూ ఉండగానే పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడం మొదలైంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు తమ సీమలు దాటి వెనకబడిన దేశాలలోని కార్మికులను దోచుకుని, సామ్రాజ్యవాద దేశాలుగా మారడం మొదలైంది. మరోవైపు చాలా పెట్టుబడిదారీ దేశాలు పరిమితమైన అభివృద్ధిని సాధించి, తమ సామ్రాజ్యాలు విస్తృతపరుచుకునే దశలో ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ బాగా అభివృద్ధి చెందిన దేశాల పాలకులు (సామ్రాజ్యవాద దోపిడీదారులు) కార్మికవర్గ విప్లవోద్యమాలను బలహీనపరిచేందుకు, వారు దురాశాపూరితంగా సంపాదించిన లాభాలలో కొంత వదులుకుని కార్మిక వర్గానికి తాయిలాలు ఇస్తున్నాయి. కానీ అంతగా పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందని దేశాలలో, పెట్టుబడిదారీ దోపిడీదారులు భూస్వామ్య దోపిడీదారులతో కుమ్మక్కై, భూస్వామ్య - పెట్టుబడిదారీ సామాజిక దోపిడీ మొదలు పెట్టారు. ఫలితంగా ఈ దేశాలలో ప్రజలు తీవ్రంగా దోపిడీకి, పీడనకు గురవుతున్నారు. ఒకవైపు కొత్తగా ఏర్పడ్డ కార్మిక వర్గం, చిన్న సంఖ్యలో ఉన్నప్పటికీ, తీవ్రమైన దోపిడీకి గురవుతుండగా, ఈ ఉమ్మడి దోపిడీ యంత్రాంగం అసంఖ్యాకంగా ఉన్న రైతాంగాన్ని మరింతగా అణచి వేస్తుంటుంది. ఈ కారణంగానే ఈ దేశాలలో దోపిడీకి గురవుతున్న ప్రజల

పోరాటాలు తీవ్రతరమవుతున్నాయి; తమను దోపిడీ చేస్తున్న వారిపై పోరాడడానికి కార్మిక వర్గం సంఘటిత పరుచుకుంటున్నది. అదే విధంగా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న రైతాంగం, వ్యవసాయ కూలీల వంటి ప్రజానీకం ఈ పోరాటాలలో మమేక మవుతున్నారు. మిగిలిన అన్ని దేశాలకంటే, తమ సంకెళ్లు తెంపుకోడానికి, రష్యా ఈ పోరాటంలో ముందుంది. అందువలనే కార్మిక వర్గ నాయకత్వంలో, రైతాంగం సైనికుల సహకారంతో ముందుగా రష్యాలో బానిస సంకెళ్ల గొలుసు తెగింది. ప్రజాతంత్ర సోషలిస్టు విప్లవం విజయం సాధించి, ప్రపంచంలోనే మొదటిసారిగా దోపిడీ రహిత సమాజం ఏర్పడింది.

**చరిత్ర నేర్పిన బోధనలు - ప్రజాతంత్ర విప్లవం గుణపాఠాలు**

ఫ్రాన్స్‌లోని కార్మిక వర్గం మార్క్సిస్టు బోధనలను మొదటిసారిగా అమలు చేసి పారిస్‌ని వర్గ పోరాటం ద్వారా హస్తగతం చేసుకుని పారిస్ కమ్యూన్‌ని ఏర్పరచింది. సోషలిస్టు వ్యవస్థకి ఇది బీజం. ఇదే ప్రపంచంలోని మొదటి కార్మిక వర్గ రాజ్యం. దోపిడీ రహిత సమాఖ్య నిర్మాణ క్రమం అప్పుడే మొదలైంది. కానీ భయకంపితులైన ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం, వెంటనే పారిస్ కమ్యూన్ పై దాడిచేసి ఓడించింది. 70 రోజులు మాత్రమే నిలిచిన కార్మిక రాజ్యం ప్రపంచ శ్రామిక ప్రజలకు విలువైన పాఠాలను నేర్పించింది. అందులో ఒకటి, పరిమితమైన కార్మిక వర్గం విప్లవాన్ని విజయవంతంగా సాధించినప్పటికీ అత్యధికంగా ఉన్న రైతాంగం మద్దతు కూడగట్టకపోవడం వలన సామ్రాజ్యవాద కూటమి దాడిని తట్టుకుని నిలవలేకపోయింది అని. అంటే, ఇటువంటి విప్లవం విజయవంతంగా నిలవాలంటే దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాల ప్రజలు ఒక గొడుగు కింద సంఘటితం చేయబడాలి. దానికి కార్మిక వర్గం నాయకత్వం వహించాలి.

కామ్రేడ్ లెనిన్ ఈ పాఠాన్ని రష్యా విప్లవానికి సరిగ్గా అన్వయించారు. 1905లో రష్యా విప్లవం విఫలమైన తరువాత, ఆయన అన్ని వెనుక పడిన తరగతులను, అణగారిన రైతాంగాన్ని సంఘటితం చేయాలని బోల్షివిక్ పార్టీని నిర్దేశించారు. అక్కడి రైతుల పిల్లలే జార్ చక్రవర్తి సైనికులు. వారిలో తీవ్రమైన అసంతృప్తి రాజుకుని ఉంది. అందువలన వారిని విప్లవంలో భాగస్వాములను చేయాలనుకున్నారు. ఫలితంగా బోల్షివిక్ విప్లవం విజయవంతమైంది. రైతాంగం నుండి, సైనికుల నుండి పెద్ద ఎత్తున విప్లవంలో పాల్గొనడం వలన రష్యాలో సోషలిస్టు నిర్మాణ క్రమం బలపడింది.

## కార్మిక కర్షక ఐక్యత అన్వయింపు

"ప్రజాతంత్ర విప్లవంలో సోషలిస్టు ప్రజాస్వామ్య సాధనకు రెండు ఎత్తుగడలు" అనే పుస్తకంలో ఈ ఆలోచనలను లెనిన్ చర్చించారు. ముఖ్యంగా, రష్యా విప్లవం విజయవంతమైన తరువాత, ప్రపంచంలోని వెనుకబడిన దేశాలలో ప్రజాతంత్ర విప్లవ నిర్మాణానికి ఈ సిద్ధాంతం యొక్క అవసరం బాగా కనిపించింది. రష్యన్ విప్లవం తర్వాత ప్రపంచంలోని అన్ని దేశాలలో కార్మిక వర్గ పార్టీలు ఏర్పడ్డాయి. ఆ పార్టీలన్నీ వారి వారి దేశాలలో వర్గపోరాటాలు నిర్మించడానికి కృషి చేయడం, ప్రజాతంత్ర విప్లవాన్ని సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. కానీ ఈ ప్రజాతంత్ర విప్లవాలు పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి చెందిన దేశాలలో లాగా జరగడం సాధ్యపడదు. ఎందుకంటే ఈ దేశాలలో పెట్టుబడిదారులు, భూస్వాములు, ఇద్దరూ దోపిడీ చేస్తున్నవారే. పెట్టుబడిదారులు భూస్వాములతో కుమ్మక్కై, ప్రజాతంత్ర విప్లవానికి వ్యతిరేకంగా ఉన్నారు. ఇటువంటి ప్రాంతాలలో జరిగే ప్రజాతంత్ర విప్లవాన్ని జనతా ప్రజాతంత్ర విప్లవంగా పిలుస్తాము ఈ విప్లవాలన్నీ పెట్టుబడిదారీ విధానానికి, భూస్వామ్య విధానానికి వ్యతిరేకం. ప్రజాస్వామ్యయుతంగా ఉంటాయి. ఈ విప్లవాలకు కార్మిక వర్గ నాయకత్వం తప్పనిసరి. కానీ, కార్మిక వర్గంతో రైతాంగం కలవడం విప్లవానికి మౌలిక వర్గ స్వరూపాన్నిస్తుంది. కార్మిక కర్షక ఐక్యత మార్క్సిజం లెనినిజం పునాదులైనందు వల్ల ఆ ఐక్యతను సాధించే దిశగా సంఘాల నిర్మాణం జరగాలి. మూడో ప్రపంచ దేశాలలో సామాజిక వ్యవస్థ మార్చడానికి మొదటి మెట్టు బూర్జువా ప్రజాతంత్ర విప్లవం సాధించడం; దీనిని కార్మిక వర్గ నాయకత్వంలో, కార్మిక కర్షక మైత్రి ద్వారా సాధించాలి. దీనినే కమ్యూనిస్టు పరిభాషలో జనతా ప్రజాతంత్ర విప్లవం అని అంటారు. చైనా విప్లవం ఈ సిద్ధాంతం సరైందని మరింత స్పష్టంగా నిరూపించింది. కేవలం జనతా ప్రజాతంత్ర విప్లవం జయప్రదమైన తర్వాత మాత్రమే సోషలిస్టు విప్లవం ద్వారా సోషలిజం నిర్మించడానికి ముందుకెళ్లాలి.

కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్టు) దీనినే తన కార్యక్రమంగా ఆమోదించింది. గుత్త పెట్టుబడిదారీ విధానాన్ని, భూస్వామ్య విధానాన్ని, విదేశీ పెట్టుబడి దోపిడీని వ్యతిరేకించడం ద్వారా మాత్రమే భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవం సాధించడం సాధ్యపడుతుంది. ఈ విప్లవం విజయవంతం అవడానికి కార్మిక వర్గం నాయకత్వం కీలకంగా ఉంటుంది. మొదట్లోనే పార్టీ కార్యక్రమంలో ఈ నిర్ణయాన్ని ఉటంకించడం జరిగింది.

పాలక వర్గం నయా–ఉదారవాద విధానాలు అమలు చేయడం మొదలు పెట్టిన దగ్గరి నుండి దేశంలో కార్మిక వర్గాన్ని, రైతాంగాన్ని చేసే దోపిడీ అనేక రెట్లు పెరిగిపోయింది. ద్రవ్య పెట్టుబడి, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిగా మారడం వల్ల దాని దోపిడీ చేసే శక్తి మరింత తీవ్రతరమైంది. దాని విస్తృతి కూడా ఎన్నో రెట్లు పెరిగింది. నయా–ఉదారవాద విధానాలు ఈ దోపిడీకి అద్దం పడుతున్నాయి.

గ్రామీణ భారతదేశంలో నయా–ఉదారవాద విధానాల అమలుతో పెట్టుబడి ఏర్పడే క్రమం తీవ్రతరం అవడం మొదలైంది. కార్పొరేట్ల ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం, అంతర్జాతీయ పెట్టుబడి ఆధిపత్యం సాంప్రదాయ చిన్న పారిశ్రామిక రంగాన్ని కష్టాలపాలు చేస్తున్నాయి. ఆ దాడిలో రైతాంగ ఆధారిత వ్యవసాయ విధానం తీవ్రమైన కష్టనష్టాలకు లోనవుతున్నది. రైతాంగ ఆధారిత వ్యవసాయాన్ని కార్పొరేట్ ఆధారిత వ్యవసాయంగా మార్చాలన్నది ప్రభుత్వ విధానంగా ఉన్నది. గత మూడు దశాబ్దాలలో ఈ విధానాలు రైతాంగంలో  అధిక సంఖ్యను సర్వ నాశనం చేసాయి. ఫలితంగా నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యవసాయం నష్టదాయకంగా మారి, అనేక మంది రైతులు వ్యవసాయాన్ని వదులుకున్నారు, భూమిని వదులు కున్నారు, వలస కూలీలుగా మారారు. వ్యవసాయ కార్మికులకు పనులే లేవు. సంవత్సరంలో ఎక్కువ రోజులు వారు నిరుద్యోగులుగా ఉండాల్సి వస్తున్నది. రేగా ప్రాజెక్ట్ వలన కూడా ఏడాదికి సరాసరిన 25 నుండి 40 రోజులు మాత్రమే పని కల్పించబడుతున్నది. గ్రామీణ పేదరికం నానాటికీ పెరుగుతున్నది. రైతులు తమ భూములను కారు చౌకగా వదులుకోవలసి వస్తున్నది. ధనిక కార్పొరేట్లు క్రమంగా ఆ భూములను నీటి కంటే తక్కువ ధర చెల్లించి ఆక్రమించుకుంటూ భూమిని తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు.

రైతులకి తమ పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదు గాని ఉత్పత్తి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించే కనీస మద్దత్తు ధరలు ఉత్పత్తి ధరలకన్నా తక్కువగా ఉంటున్నాయి. రైతాంగంలో 6 శాతానికి మాత్రమే గిట్టుబాటు ధారలనేవి వర్తిస్తున్నాయి. 94 శాతం ఆ ధరలను పొందలేని స్థితిలో ఉన్నారు. అదే సమయంలో రైతులకు ఆర్థిక సంస్థల నుండి రుణాలు అందడం లేదు. వడ్డీ వ్యాపారుల దగ్గర నుండి అప్పులు తెచ్చుకోవాల్సి వస్తున్నది. వారికి అధిక వడ్డీలు చెల్లించవలసి వస్తున్నది. ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయడం లేదు. అందువల్ల చాలామంది రైతులు పంటలను ప్రైవేటు వ్యాపారులకు, మధ్యవర్తులకు తక్కువ ధరకు  అమ్ముకోవాల్సి వస్తున్నది. పంటల భీమాలలో అనేక లొసుగులున్న కారణంగా, వాతావరణాలు అనుకూలించక  పంటలు పండకపోతే,

రైతులు తీవ్రంగా నష్టపోవలసి వస్తున్నది. అందువల్ల అనేక మంది రైతులు ప్రతి సంవత్సరం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతుల, వ్యవసాయ కార్మికుల, ఇతర గ్రామీణ కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉందనడంలో తప్పే లేదు. ఇది భారతదేశం నేడు ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభాన్ని సూక్ష్మంగా తెలియచేస్తుంది.

కార్మికుల పరిస్థితి కూడా నానాటికి త్వరితగతిన దిగజారుతూనే ఉంది. మోడీ ప్రభుత్వం దానికి వంతపాడే మీడియా, ప్రతి నిమిషం జిడిపి పెరుగుదలను గురించే మాట్లాడుతుంటారు. కానీ, వాస్తవంలో ప్రజల పరిస్థితి దిగజారుతూనే ఉంది.

గత నలభై ఏళ్లలో ఎన్నడూ లేని స్థాయిలో నిరుద్యోగిత ఉంది. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలిస్తానన్న మోడీ మాటల గారడీ అందుకు ఒక గొప్ప ఉదాహరణ. ఇప్పుడు అభివృద్ధి అంటే అందరూ భయపడే పదం – అది విధ్వంస పరాకాష్ట. “అభివృద్ధి” తోపాటు ఉద్యోగిత కూడా పెరగకపోతే అది కార్పొరేట్ల లాభాలను మాత్రమే పెంచుతుంది. కొత్తగా ఉద్యోగాల కోసం వెతుక్కుంటున్న వారికి ఉద్యోగాలు దొరకకపోగా ఉద్యోగాలు చేసుకుంటున్నవారు కూడా ఉద్యోగాలు పోగొట్టుకోవడం ఆశ్చర్యకరమైన విషయం. ఉన్న ఉద్యోగస్తులలో కూడా స్థిరమైన ఉద్యోగాలున్న వారి సంఖ్య దిగజారుతుండగా కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నది. ప్రభుత్వ ఏజెన్సీలు, పరిశ్రమలు, నీటిపారుదల రంగం కారు చవకగా ప్రైవేటు కంపెనీల పరమవుతున్నాయి. వ్యవసాయ రంగం, పరిశ్రమలు, నీటిపారుదల, రక్షణ, చిన్న పరిశ్రమలు, విద్య , ఆరోగ్యం తదితర రంగాలలో విదేశీ పెట్టుబడుల ప్రవాహం వచ్చి చేరుతుండడంతో ప్రైవేటు పెట్టుబడులు విపరీతంగా పెరుగుతున్నాయి. కోట్లాది రూపాయలు పెట్టుబడులకు పన్నుల మినహాయింపులు, అప్పుల చెల్లింపుల మినహాయింపులు చేసే విధంగా విధానాలు రూపకల్పన చేయడంతో కార్పొరేట్ పెట్టుబడి ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్నది. ప్రభుత్వ విధానాలు సట్టా పెట్టుబడులు పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి. ఫలితంగా కార్మికులపై దోపిడీ ఎన్నడూ లేని విధంగా ఇష్టానుసారంగా పెరుగుతున్నది. ఒకవైపు అప్పుల భారం పెరుగుతున్నది. మరోవైపు ఆదాయాలు తరుగుతున్నాయి. సంక్షేమ రక్షక వలయం కరిగిపోతున్నది. మహిళా శ్రామికుల దోపిడీ మరింత ఎక్కువగా పెరుగుతున్నది. బాల కార్మికుల నియామకాలూ ఆగడం లేదు. రోజువారీ అవసరాలైన పెట్రోల్ డిజిల్ వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వాటి పెరుగుదలకు హద్దే లేదు. ఈ పరిస్థితులలో కరోనా మహమ్మారి ఆవరించింది. భారతదేశంలో వ్యాధి త్వరగా వ్యాప్తి చెందుతున్న దశలో మోడీ ప్రభుత్వం దానిని ఎదుర్కోడానికి

ఏ విధమైన సన్నాహాలు చేయలేదు. ప్రణాళికలు రచించలేదు. అకస్మాత్తుగా దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటించింది. శ్రమజీవులకు అంతులేని పేదరికాన్ని మిగిల్చింది.

ఈ మహమ్మారి దేశంలో 3 కోట్ల జనాభాకు వ్యాపించింది. లక్షలాది మంది చనిపోయారు. అధికారిక లెక్కల ప్రకారం చనిపోయిన వారి సంఖ్య నాలుగు లక్షలు. లాక్‌డౌన్ కారణంగా రవాణా స్తంభించిపోయింది. లక్షలాది కార్మికులు పని ప్రదేశాలలో బంధించబడ్డారు. పరిశ్రమలు మూత బడి జీవనం కోల్పోయారు. లక్షలాది వలస కార్మికులు చెప్పనలవి కానన్ని సవాళ్ళను ఎదుర్కోవలసి వచ్చింది. ప్రభుత్వం వారి ఆహారం కోసం, వసతి కోసం ఎటువంటి ఏర్పాట్లు చేయనందువల్ల ప్రజల సంక్షోభం మరింత తీవ్రతరమైంది. నిరుద్యోగం, ఆకలి హద్దులు దాటింది. ప్రజల కొనుగోలు శక్తి శూన్యమైంది. ప్రభుత్వం ఏ మాత్రం జోక్యం చేసుకోకపోవడం దాని పూర్తి వైఫల్యమే. తప్పుడు ప్యాకేజీలు, తప్పుదారి పట్టించే ప్యాకేజీలు ప్రకటించి సామాన్య ప్రజానీకాన్ని దుర్భర దారిద్ర్యంలోకి నెట్టి బడా పెట్టుబడిదారులకు కోట్లు కట్టపెట్టింది. కార్మికుల కష్టాలకు అంతేలేదు. లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయి వీధుల పాలయ్యారు. ప్రజారోగ్యం కూలిపోయింది. నిరంతరంగా ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలతో చెవులు చిల్లులు పడ్డాయి. సరైన సమయంలో పంటల గురించిన శ్రద్ధ తీసుకోలేకపోవడం వల్ల రైతుల జీవితాలు మరింత కుదేలయ్యాయి. ప్రభుత్వాలు పంటలను సేకరించకపోవడం వల్ల వారి ఆదాయాలు పడిపోయాయి. వ్యవసాయ కార్మికులకు పనులు లేవు. వారిలో పస్తులు పెరిగాయి. పసి పిల్లల్లో పోషకాహార లోపం ఉచ్ఛ స్థితికి చేరింది. ఇటువంటి గడ్డు పరిస్థితులలో పోరాటాలు చేసే హక్కులు కూడా తొలగించబడ్డాయి. ప్రజాతంత్ర వ్యవస్థ ప్రమాదంలో పడింది. కార్మికుల సంఘటిత హక్కు కుదించబడింది. సంస్కరణల పేరుతో కార్మిక కోడ్ అంటూ కార్మిక వ్యతిరేక చట్టాలు చేయబడ్డాయి. లాక్‌డౌన్ వల్ల సాధారణ పౌరుడు దాదాపు ఇంటికే పరిమితమవవలసిన పరిస్థితులలో ప్రభుత్వం ఒకదాని వెనక మరో ప్రజా వ్యతిరేక విధానాల అమలుకు పూనుకుంది. అమలులో వున్న అన్ని కార్మిక చట్టాలను రద్దు చేసింది. వాటి స్థానంలో నాలుగు కార్మిక కోడ్‌లను తయారు చేసింది. తద్వారా కార్మికులను నిరంతరంగా, నిర్విఘ్నంగా కంపెనీలు దోచుకునే వీలు కల్పించింది. అదే సమయంలో రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చింది. వాటిని చట్ట వ్యతిరేకంగా పార్లమెంటులో పాస్ చేయించుకుంది. ఇది రైతాంగంలో తీవ్రమైన సంక్షోభానికి కారణమైంది. లక్షలాది రైతులు ఉద్యమబాట పట్టారు. ప్రభుత్వం, రైతాంగంతో చర్చలు జరపకుండా, ఈ నల్ల చట్టాలను తప్పనిసరిగా

రైతాంగంపై రుద్దాలని ప్రయత్నిస్తున్నది. ఈ రోజు రైతాంగం అంతా ఐకమత్యంగా ఉన్నారు, అహింసాయుతంగా ఉన్నారు. దేశంలో చారిత్రాత్మక రైతాంగ ఉద్యమం కొనసాగుతున్నది.

అంతేకాదు ఆర్ఎస్ఎస్ సారథ్యంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం అప్రజా స్వామికంగా, ఫాసిస్టు తరహాలో, మతతత్వంతో దేశంలో అణచివేత పరిపాలన కొనసాగిస్తున్నది. భారతదేశ చరిత్రలో ఇది అత్యంత కార్మిక వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక ప్రభుత్వం. మరో వైపు ప్రభుత్వం నయా-ఉదారవాద విధానాలను గుడ్డిగా అనుసరిస్తోంది. ప్రజలకు నిరసనలు తెలిపే ప్రజాతంత్ర హక్కును కాల రాస్తున్నది. ప్రభుత్వం 'ఉపా' లాంటి రాజ్యాంగ వ్యతిరేక, ప్రజాతంత్ర వ్యతిరేక చట్టాలను తెస్తున్నది. ప్రసార మాధ్యమాలను భయపెట్టో, ప్రలోభపెట్టో పూర్తిగా తన అధీనంలో ఉంచుకుంది. ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలుతోంది. అదే సమయంలో, విపరీతంగా అప్పులు చేసిన అవినీతికర పెట్టుబడిదారీ దోషులు దేశం నుండి సునాయాసంగా పారిపోతున్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ హరించబడుతున్నది. అసమ్మతిపై 'దేశద్రోహ' ముద్ర వేస్తున్నారు. పార్లమెంటు, రాజ్యాంగం, చట్టం, న్యాయ వ్యవస్థ ఖైదు చేయబడ్డాయి. అదే సమయంలో మతతత్వం చెలరేగుతున్నది. ముస్లిం క్రిస్టియన్ మైనారిటీలు, దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులు అందరూ మతం పేరుతో, కులం పేరుతో దాడులకు గురవుతున్నారు. 'హిందూ రాజ్యం' ఏర్పాటు అనే లక్ష్య సాధనకు తీవ్రతరమై మత ప్రాతిపదికన జాతి కేంద్రీకృతమవుతున్నది. ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్, ఇతర మితవాద హిందూ సంస్థలు స్వేచ్ఛగా ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. ముఖ్యంగా మైనారిటీలను, అభ్యుదయ భావాలూ కలవారిని లక్ష్యంగా చేసుకుంటున్నాయి.

గో రక్షణ పేరుతో మూకదాడులు చేసి ప్రజలను చంపేస్తున్నారు. పోలీసులు, అధికార యంత్రాంగం దోషులకు అండగా నిలుస్తున్నాయి. మహిళలకు వ్యతిరేకంగా హింస విచ్చలవిడిగా సాగుతున్నది. మహిళలను ముఖ్యంగా అణగారిన తరగతుల మహిళలను, మానభంగం చేయడం సర్వసాధారణంగా మారింది. పౌర హక్కులు హరించే కుట్ర జరుగుతున్నది. ప్రజాతంత్ర వ్యవస్థకి వ్యతిరేకంగా, నియంతృత్వ మతతత్వ పాలన దేశంలో స్థాపించబడింది. ఇది అప్రకటిత అత్యవసర పరిస్థితి.

## కార్మిక వర్గం పై దాడి- ఐక్యంగా ఉండాల్సిన సమయం

దేశంలో నివసిస్తున్న శ్రమజీవులందరూ నష్టపోతున్నారు. కార్మికులు, రైతాంగం. అసంఘటిత కార్మికులు, మహిళలు, దాడికి కేంద్రంగా ఉన్నారు. ఈ

దాడి తీవ్రత నయా–ఉదారవాద విధానాలు అమలవడంతో మరింతగా పెరిగింది. అందువలన కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు కలిసి శక్తివంచన లేకుండా ఈ బహుముఖ దాడిని ఎదుర్కోవాలి. విస్తృతంగా చెప్పాలంటే ఈ మూడూ ఉత్పత్తి చేసే తరగతులు. మిగిలినవారందరూ వినిమయదారులే. నయా–ఉదారవాదం ఉత్పత్తి తరగతులను దోపిడీ చేసినట్టే ఇతరులలో విపరీతమైన వినిమయాన్ని జొప్పించి పేదలకు వ్యతిరేకంగా నిలబెడుతున్నది. ప్రభుత్వం కూడా జనాభాలో పైనున్న 1 శాతానికి దేశ సంపదను యధేచ్ఛగా కొల్లగొట్టుకునే దారిని ఏర్పరచింది. ఈ పరిస్థితులు దోపిడీ చేయబడుతున్న తరగతులు, అంటే, కార్మికులు కర్షకులు, వ్యవసాయ కూలీలు దోపిడీదారులకి వ్యతిరేకంగా ఐక్యమయే వాతావరణాన్ని సృష్టించాయి. నయా–ఉదారవాద విధానాలు కార్మికులకు శత్రువులు. వాటిని అమలు చేసే వారు కార్మిక వర్గానికి ఆగర్భ శత్రువులు. ఈ పరిస్థితులు వర్గ పోరాటాలకు అనువైనవి. పెట్టుబడిదారీ వ్యవస్థ పీడితులను ఐక్యపరచి పోరాటాలు చేయడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఉమ్మడి శత్రువును ఎదుర్కోడానికి ఉమ్మడి పోరాటాలు చేయడానికి ఇదే అదను. కార్మిక కర్షక మైత్రిని ఏర్పరచుకుని ఐక్య పోరాటాలు చేయాల్సిన సమయం. దీని ప్రాధాన్యతను ఎంత తొందరగా గుర్తిస్తే అంత తొందరగా మనం కార్మిక కర్షక మైత్రిని, ఐక్య వర్గ పోరాటాలను తీవ్రతరం చేసి నిర్మించగలుగుతాం.

## నిజానికి మనం ఎక్కడున్నాం?

సిద్ధాంతపరంగా కార్మిక కర్షక మైత్రి ఉండాలని అంగీకరించినా, పార్టీ కార్యక్రమంలో అనేక పర్యాయాలు చెప్పుకున్నా, అనేక తీర్మానాలు చేసినా, ఉమ్మడి వేదికను నిర్మించడంలో సరైన కృషి జరగలేదని మనం చూస్తూనే ఉన్నాం. మనకు నిర్దిష్టమైన 'దిశానిర్దేశం' చేసే విధానం లేదు. ప్రత్యేకమైన ప్రణాళిక అంటూ లేదు. పిలుపు ఇస్తే సరిపోతుందని భావిస్తున్నాము. అంచెలంచెలుగా దానిని నిర్మించవలసిన అవసరం ఉందని అనుకోడం లేదు. పార్టీ పిలుపు మేరకు అనేక పోరాటాలకు కార్మికులు కర్షకులు హాజరయ్యి వెనక్కు వెళ్లిపోయారు. వాటి ద్వారా రాజకీయంగా, సంస్థాగతంగా, సైద్ధాంతికంగా రెండు తరగతుల మధ్య ఐక్యత తనంత తానే అభివృద్ధి చెందలేదు. అందుకు చైతన్యవంతమైన నిరంతర ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. పార్టీకి రైతాంగంలో కార్మిక సంఘాలలో సబ్ కమిటీలు ఉన్నాయి. ఒక్కొక్కసారి వారు ఉమ్మడిగా చర్చించుకుంటూ ఉంటారు. కానీ కార్మిక కర్షక మైత్రిని గురించిన ఉమ్మడి ప్రత్యేక కార్యక్రమం వారెన్నడూ తీసుకోలేదు. సబ్

కమిటీలు రెండూ కలిసి సమావేశాలు వేసుకున్నప్పుడు కూడా కలిసి ప్రణాళికలు రచించుకోడం లేదు. కార్మిక కర్షక ఉమ్మడి వేదిక నాయకులు పార్టీ ఎగువ కమిటీలలో ఉంటారు కానీ వారు ఈ కమిటీలకు క్రమం తప్పకుండా హాజరు కారు. (ఉదాహరణకి సెక్రటేరియట్). ఈ కమిటీల నాయకులు రెండు ఉమ్మడి వేదికల చర్చల విశ్లేషణలలో లోతుగా పాల్గొన్నట్టు గాని, విషయాన్ని గురించి కూలంకుషంగా చర్చించినట్టుగాని ఎక్కడ దాఖలాలు లేవు. కేంద్రంలోగాని రాష్ట్రాలలోగాని ఉమ్మడి ప్రణాళిక కనిపించదు. అందువలన వాస్తవంలో కార్మిక కర్షక మైత్రి పార్టీ కార్యక్రమంలో మాత్రమే చాలా కాలంగా మిగిలిపోయింది. పార్టీ చొరవ తీసుకోలేదని పార్టీని మాత్రమే నిందించలేము. ఎందుకంటే రెండు ప్రజా సంఘాల నాయకుల నుండి కూడా సంయుక్త పోరాటాలను నిర్మించాలన్న ప్రతిపాదనలు చేసిన సందర్భాలు లేవు. తమిళనాడులో వ్యవసాయ కార్మికుల భవన నిర్మాణానికి సిఐటియూ నిధులను సమీకరించి పెట్టింది. కానీ ఇద్దరు కలిసి సంయుక్తంగా కార్మిక కర్షక మైత్రి కోసం ఉమ్మడి కార్యక్రమాలు చేసిన విషయం మనకు తెలియదు. అంటే నాయకులు తరచుగా కలుస్తున్నప్పటికీ రెండు వర్గాల మధ్య నిజమైన ఐక్యత సాధించబడలేదు. ఒకరి సమస్యల పట్ల వేరొకరు మార్క్సిస్టు తాత్వికత దృష్టిలో అవగాహన కలిగి ఉండి, ఒకరినొకరు అర్థం చేసుకుంటే వర్గ ఐక్యతకు అది దోహదం చేస్తుంది. లేని పక్షంలో ఏ తరగతికి ఆ తరగతి తన సమస్యలతో సతమతమవుతూ ఉంటుంది. ఇతరుల సమస్యలను పట్టించుకోదు. రెండు తరగతుల మధ్య అవగాహన ఉండదు. రెండు తరగతుల ప్రజలు వేర్వేరు ద్వీపాల నుండి వచ్చినట్టు భావించుకుంటుంటారు. అప్పుడప్పుడు కలుస్తుంటారు గాని వర్గ ఐక్యత మాట అటుంచి, వారి మధ్య స్నేహ బంధం కూడా ఉండదు.

## ఈ దూరాన్ని గుర్తించడం

## అధిగమించేందుకు ప్రయత్నాలు చేయడం, సూచనలివ్వడం

ఈ విషయంలో మేము చేసిన ప్రయత్నాలలో మా అనుభవంలో కొన్ని అనుకూలమైన అంశాలు కనిపించాయి. గత కొన్నేళ్లుగా కిసాన్ సభ, సిఐటియూ, ఖేత్ మజ్దూర్ సంఘాల కేంద్ర నాయకులు ఈ విషయంపై చర్చించడం మొదలు పెట్టారు. కొన్ని సార్లు చర్చలు జరిగిన తర్వాత కార్మికులను కర్షకులను ప్రజా సంఘాలుగా ఒక తాటిపై తేడానికి ప్రయత్నాలు చేయాలనే అంగీకారానికి వచ్చారు. ఇది ఒక ముందడుగు మాత్రమే అయ్యుండవచ్చు. మౌలికంగా దోపిడీకి గురవుతున్న

ఈ వర్గాలను ఎలా ఒక చోట చేర్చాలి, ఈ ఐక్యత బలపడాలంటే ఎలాంటి కార్యక్రమాలు రూపొందించుకోవాలి, అనే విషయాలు చర్చించడం జరుగుతున్నది. ఈ రంగాల నాయకులు క్రమం తప్పకుండా సమావేశ మవుతున్నారు. చాలా చర్చలు జరిగిన తర్వాత ఒక కార్యక్రమం ఆమోదించారు. 1982లో మొదటి సారిగా 'భారత్ బంద్' కి పిలుపునిచ్చారు. ఆ ఏడాది జనవరి 19వ తేదీన బంద్‌లో పాల్గొన్నందుకు 10 మంది కామ్రేడ్లను పోలీసుల చేత కాల్చివేయబడ్డారు. తమిళనాడు, ఉత్తర్ ప్రదేశ్‌లలో ఈ కాల్పులు జరిగాయి. నలుగురు వ్యవసాయ కార్మికులు, ముగ్గురు రైతులు, ముగ్గురు కార్మికులు బలయ్యారు. ఆ రోజు దోపిడీకి గురవుతున్న పది మంది కామ్రేడ్లు అమరులయ్యారు – వారి రక్త తర్పణంలో దేశం మూడు రంగాల శ్రామికులు ఐక్యంగా, త్యాగం చేయడాన్ని చూసింది. ఈ ఐక్య ఉద్యమమే మూడు సంఘాల ఉమ్మడి ఉద్యమానికి పునాదిగా నిలపాలని నిర్ణయం తీసుకున్నాం. అయిదేళ్ల కిందట సిఐటియూ, ఏఐకెఎస్, ఏఐఏడబ్ల్యూయూ కలిసి జనవరి 19వ తేదీని శ్రమజీవుల ఐక్యతా దినంగా జరపాలని నిర్ణయించుకున్నాయి. ఈ నిర్ణయాన్ని ఒక సర్క్యులర్‌గా దేశంలోని మూడు సంఘాలకు పంపాము. అదే సమయంలో మూడు సంఘాల ప్రధాన కార్యదర్శులు కలిసి మూడు సంఘాల కార్యదర్శులకు, అన్ని రాష్ట్రాలలో ఈ ఉమ్మడి కార్యక్రమం నిర్వహించాలని కోరుతూ సర్క్యులర్ పంపించారు. రాష్ట్ర పార్టీల ప్రచార మాధ్యమాలు – వార్త పత్రికలూ, వార పత్రికలూ వగైరా – ద్వారా కార్మికులకు  కర్షకులకు ఈ ఐక్య ఉద్యమాల అవశ్యకత యొక్క ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించాలని నిర్ణయించాం. దేశంలో ఆ సంవత్సరమే మొదటిసారిగా మూడు తరగతులకు చెందిన శ్రమజీవులందరు కలిసి తమ స్వతంత్ర కార్యక్రమాలు అమలు చేయడానికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మొదటి సంవత్సరమే అన్ని రాష్ట్రాలు ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి కృషి చేసాయి. అయితే అవి అనుకున్న రీతిలో విజయవంతం కాలేదని మేము గుర్తించాము. రెండో సంవత్సరం ఈ అమరవీరుల దినాన్ని విజయవంతంగా జరపడానికి మరికొంత చొరవ తీసుకున్నాము. సర్క్యులర్లు ఇచ్చాము. సంయుక్తంగా ఉత్తరాలు రాశాము. పార్టీ పత్రికలలో ప్రచురించాము. కలిసి పనిచేస్తే తప్ప విజయాలు సాధించలేమని శ్రమజీవులు గ్రహించ గలగేటట్టు కృషి చేసాం. ఆ ఏడూ కొన్ని కొత్త ప్రదేశాలలో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మూడో ఏడు  మరికొన్ని రాష్ట్రాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. రాష్ట్ర నాయకులు ఈ కార్యక్రమానికి ప్రాధాన్యతనివ్వడం, వారిచ్చిన రిపోర్టులలో కనిపించింది. కొన్ని చోట్ల జిల్లా

కేంద్రాలలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. దాని తర్వాత కేంద్ర నాయకత్వం క్రమం తప్పకుండా జాయింట్ ఉద్యమాల కార్యక్రమాలకు పిలుపులిచ్చే అవకాశాలను పరిశీలించి, 'అంగన్వాడీ' ఉద్యోగుల సమస్యలో, పవర్ కార్మికుల సమస్యలో ఐక్య ఉద్యమాలకు పిలుపులివ్వడం జరిగింది. వీటిలో పాక్షిక విజయం సాధించాము. రాష్ట్ర స్థాయిలో మూడు తరగతుల సంఘాలను ఐక్యం చేయడం కార్మికులను ఉత్సాహపరిచిందని మాకు రిపోర్టులు వచ్చాయి. శ్రామికులు ఒకరినొకరు తెలుసుకోవాలని, కలుసుకోవాలని అనుకుంటున్నారు. అయితే అందుకు తీసుకోవలసిన క్రియాశీలమైన చొరవ చాలా రాష్ట్రాలలో కొరవడింది. కేవలం సర్క్యులర్ ఇచ్చి, ఉత్తరాలు రాసి కేంద్రం కూర్చోలేదు. కేంద్ర నాయకత్వం రాష్ట్రాలకు వెళ్లి ఐక్యత ప్రాధాన్యతను వివరించి, విప్లవ ప్రాముఖ్యతను రాష్ట్ర నాయకత్వానికి నొక్కి చెప్పే ప్రయత్నం చేసింది. మా ప్రయత్నాలు అనుకూల ఫలితాలిచ్చాయి.

ఫలితంగా కార్మికులను, కర్షకులు, వ్యవసాయ కార్మికులను కలిపిన సంపూర్ణ ఐక్య ఉద్యమాలను సంఘటితం చేయడానికి, ఆ తరువాత ప్రణాళిక రచించడం జరిగింది. ఆల్ ఇండియా కిసాన్ సభ, దేశంలోని రైతాంగాన్నంతటిని కలిసి, వ్యవసాయ సంక్షోభాన్ని గురించి తెలియచేసి, వారి సంతకాలు సేకరించాలని నిర్ణయించింది. ఆగస్టు 9వ తేదీ, దేశంలో ఒక చారిత్రాత్మికమైన రోజు. ఆ రోజు క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభ దినం. ఆ రోజే ఐక్య ఉద్యమం, మిలిటెంట్ 'జైలు భరో ఉద్యమాన్ని, 'నరేంద్రమోడీ గద్దె దిగు' అనే పిలుపులను ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది. దేశం కరోనా వైరస్ ప్రాణాంతక వ్యాధితో నిండా మునిగి ఉంది. కానీ కోవిడ్ నిబంధనలు పాటిస్తూనే వీధుల్లోకి రమ్మని మేము పిలుపునిచ్చాము. మొత్తం దేశాన్ని వినాశనానికి గురి చేస్తున్న మోడీ, మనలను మాత్రం గడప దాటి బయటకి రావద్దంటున్నారు. దీనిని మనం అంగీకరించలేము. అందువలన ఈ తుంటరితనాన్ని ఎదిరించమని ఏఐకెఎస్ పిలుపునిచ్చింది. సిఐటియూ ఈ పిలుపుకి మద్దత్తు పలికింది. తానిందులో క్రియాశీలంగా పాల్గొంటున్నట్టు ప్రకటించింది. సెప్టెంబర్ 5వ తేదీ ఢిల్లీలో ప్రజలచే ర్యాలికి పిలుపునిచ్చింది. ఏఐకెఎస్, ఏఐఏడబ్ల్యూయూ ఈ ర్యాలిలో 'మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ రాలీ' గా పాల్గొనేందుకు నిర్ణయించాయి. ఈ సంయుక్త పిలుపుకి విశేష స్పందన వచ్చింది. ఒకే ఒక పిలుపుతో జన సమీకరణ పదిరెట్లు పెరిగింది. కార్మికులను కర్షకులను వ్యవసాయ కార్మికుల ఉమ్మడి ప్రయోజనం కోసం ఒకే చోటికి ఎలా చేర్చగలమో ఈ సందర్భంలో తెలిసింది. ఇటువంటి ఘటన ఇదివరకెన్నడూ జరగలేదు.

సన్నాహక దశలోనూ, ఆ తర్వాత ఉద్యమం చివరి వరకు ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం పైన తీసుకున్న నిర్ణయాలు సరైనవని, ప్రయోజనకరమైనవని తెలియచేస్తున్నాయి. ఆ తరువాత, మూడు సంఘాల అఖిల భారత నాయకులు తరచుగా కలుసుకుంటూ, కలిసికట్టుగా ప్రతి చిన్నపనులకు వివరంగా ప్రణాళిక రచిస్తూ, ఆచరణ కోసం సంయుక్త కర్యాచరణ కమిటీలు ఏర్పాటు చేసుకున్నాము. ఈ కార్యక్రమం సమూలంగా విజయవంతం కావడానికి, కేంద్ర నాయకత్వం మూడు సంఘాల రాష్ట్ర నాయకత్వాన్ని క్రమం తప్పకుండా హెచ్చరికలు చేస్తూ వచ్చింది. మాకు తెలిసిన సమాచారం ప్రకారం చాలా రాష్ట్రాలు మనస్ఫూర్తిగా ఈ ఐక్య ఉద్యమాలలో పాల్గొన్నా, అనేక రాష్ట్రాలలో మూడు సంఘాల నాయకులు సంయుక్త సమావేశాలను వేయలేదు. ఇది సంఘాలలో నెలకొన్న తీవ్రమైన అలసత్వాన్ని, ఉద్యమం యొక్క విప్లవ ప్రాధాన్యతని అర్థం చేసుకోడంలో వైఫల్యాన్ని సూచిస్తుంది. ఈ బలహీతను అధిగమించేందుకు కార్మిక కర్షక సంఘాల నాయకులు నిరంతరంగా ప్రయత్నాలు చేస్తుండాలి. ఉమ్మడి నాయకత్వాన్ని నిర్మించుకోవాలి. కార్మికులను కర్షకులను ఒకే లక్ష్యంతో పనిచేసేందుకు సంసిద్ధులను చేయాలి. అప్పుడే కార్మిక కర్షక మైత్రిని మరో అడుగు ముందుకు తీసుకెళ్ల గలుగుతాము. ఇప్పటికిప్పుడు మాత్రం, ఇప్పుడున్న ఐక్యతను, మార్క్సిజం చెప్పే విధంగా, ఎదో ఒక రోజు విప్లవానికి నాయత్వం వహించే విప్లవాత్మక వామపక్ష ప్రజాతంత్ర వేదిక ఏర్పాటుకు అవసరమైన, 'కార్మిక కర్షక ఐక్యత' అని అనలేము. కానీ, ఈ మా ప్రయత్నాలు విప్లవాత్మక వర్గ మిత్రత్వం నిర్మించడానికి ప్రాథమికంగా సహాయపడుతుందని విశ్వసిస్తున్నాము. అందువల్ల ఈ విషయంలో కార్మిక కర్షక వ్యవసాయ కార్మిక నాయకత్వం, బలహీనతలను అధిగమించి ఈ మూడు తరగతుల మధ్య అవగాహన, నమ్మకం, సాన్నిహిత్యం, ఐక్య కార్యాచరణల కొనసాగింపుకు నిరంతరంగా కృషి చేయాలి. తద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన నాయకత్వం నిర్మించబడాలి. అది కార్మిక కర్షక వ్యవసాయ కూలీలను ఉత్సాహ పరుస్తుంది. వారి మధ్య మైత్రీ బంధం బలపడడానికి అవసరమైన పునాది దృఢపడుతుంది. క్రమంగా ఈ ఐక్యతను, ఒకరినొకరు గౌరవించుకునే విధంగా, ఒకరి డిమాండ్లు, సమస్యలు, పని విధానాలు, కలవాల్సిన అవసరాలు, అందుకు ప్రేరణ జనతా ప్రజాతంత్ర విప్లవ నిర్మాణానికి వర్గ మైత్రి ప్రాధాన్యత, అర్థం చేసుకునే విధంగా, గ్రామస్థాయికి, కార్మిక కర్షక వ్యవసాయ కూలీల యూనిట్ల స్థాయికి తీసుకెళ్లాలి.

మన ప్రయత్నాలు శ్రమజీవుల ఐక్యతకు దోహదపడతాయని మనం ఎప్పుడూ మనసులో ఉంచుకోవాలి. ఈ ప్రయత్నంలో మనం మిగిలిన ప్రజానీకాన్ని కూడా కలుపుకోవాలి. మహిళలు, విద్యార్థులు, యువతీ యువకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చిన్న మధ్యతరగతి వ్యాపారులు, చిన్న ఉత్పత్తిదారులు, దళితులు, గిరిజనులు – సమాజంలో నిరంతరం దోపిడీకి పీడనకు గురవుతున్న అన్ని తరగతుల ప్రజానీకాన్నీ కలుపుకోవాలి. వారు వారి సమస్యల గురించి తమ తమ జండాలు కింద పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఈ పోరాటాలన్నీ ప్రజాతంత్ర ఉద్యమాలలో, వర్గ పోరాటాలలో భాగాలే. ఈ తరగతుల ఉద్యమాలన్నిటిని కార్మిక కర్షక ఉద్యమాలతో కలపగలిగితే వామపక్ష ప్రజాతంత్ర వేదిక భారీగా తయారై, బలపడుతుంది.

**మా అనుభవాలు**

మా ప్రయత్నాలు మంచి ఫలితాలనిచ్చాయి. స్వాతంత్రానంతర భారతదేశ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున కార్మిక కర్షక వ్యవసాయ కార్మికులు కలిసిన సందర్భాలు లేవు. ఈ సారి 407 జిల్లాలలో (మొత్తం దేశం లోనే 720 జిల్లాలున్నాయి) 631 జైళ్లలో 5 లక్షలకు మించి కార్మికులు కర్షకులు వ్యవసాయ కార్మికులు జైలు భరో ఉద్యమానికి స్పందించారు. గతంలో మన కార్యక్రమాలు 200 నుండి 250 జిల్లాలకు పరిమితమయ్యేవి. అంతే కాదు, ఎర్ర జండాలు చేతులలో పట్టుకుని పోలీసుల బారికేడ్లు ధ్వంసం చేసారు. మిలిటెంటుగా జైళ్లకు వెళ్లాలనుకున్నారు. ఈ విధమైన పోరాటం ఇది వరకు జరగలేదు. దోపిడీకి గురైన ప్రజానీకం ఇదివరకెన్నడూ ఇంత ఉత్సాహంగా ఏకమవలేదు. దేశవ్యాప్తంగా ఒకేసారి కదల లేదు. పైగా మిలిటెంటుగా యువకులు ఈ ఉద్యమంలో పాల్గొనడం ఈ పోరాటంలో కొత్త పరిణామం. అదే సమయంలో "జైలు భరో", ఢిల్లీ చలో" వంటి నినాదాలు అందరి నుండి ఎగసి పడడంతో ఉత్సాహం ఉరకలేసి, ఉద్యమాన్ని ఉచ్ఛస్థితికి తీసుకెళ్లింది.

సెప్టెంబర్ 5వ తేదీ పార్లమెంటు ఎదురుగా జరిగిన భారీ కార్మిక కర్షక వ్యవసాయ కార్మికుల ర్యాలిలో ఇది ప్రతిఫలించింది. అది కూడా మూడు వారాల తేడాలోనే జరిగింది. ఢిల్లీలో అదివరకెన్నడు ఇన్ని ఎర్ర జండాలు కనిపించలేదు. ఈ పోరాటానికి దేశవ్యాప్తంగా ముందస్తు సన్నాహాలు జరిగాయి. కామ్రేడ్లు రైలు టిక్కెట్లు, బస్ టిక్కెట్లు ముందుగా బుక్ చేసుకున్నారు. ఢిల్లీలో ఉండేందులు వసతి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ఏర్పాట్లు కొన్ని చోట్ల రెండు నెలల ముందు నుండి

మొదలయ్యాయి. పోరాటాల కాలంలో అందులో పాల్గొన్న మూడు ప్రజా సంఘాల సభ్యుల మధ్య బంధాలు బలపడ్డాయి. స్వాగత కమిటీ శ్రమజీవులను ఢిల్లీకి ఆహ్వానించడానికి విపరీతమైన సన్నాహాలు చేసింది. ఏడు రోజులు తప్ప వరుసగా పడిన వానలు అనేక సమస్యలను తెచ్చిపెట్టింది. రాంలీలా మైదానంలో పెద్ద భాగం నీటితో నిండి పోయింది. వేసిన గుడారాలన్నీ మునిగిపోయాయి. నగరంలోని విద్యార్థి, యువకుల, మహిళల అసాధారణ అంకిత భావం వలన మాత్రమే కొన్ని ఏర్పాట్లు చేయగలిగాము. కామ్రేడ్లు సెప్టెంబర్ 2వ తేదీ నుండే రావడం మొదలు పెట్టారు. ఆ వరద ప్రవాహం సెప్టెంబర్ 5న మాత్రమే ఆగింది. సెప్టెంబర్ 5వ తేదీ పొద్దున్న వానలోనే ప్రదర్శన మైదానం నుండి పార్లమెంటు వైపుకు బయలుదేరింది. వర్షం ధారాపాతంగా ఒకవైపు పడుతుండగానే ఎర్రజండాల ఉప్పెన పార్లమెంటును తాకింది. ప్రదర్శకులు వానని లెక్క చేయలేదు. సామాన్యులు ఎదుర్కొన్న కఠిన దృశ్యాలను కళ్ళతో చూడకపోతే నమ్మడం కష్టమే. వాటి వెనక, అసామాన్యంగా ఉత్తేజపరిచే కార్మిక కర్షక మైత్రీ బంధం ఉంది. అన్ని కష్టాలు పడుతున్నా ఏ ఒక్క కామ్రేడ్ వాటి గురించి పిర్యాదు చేయనే లేదు. ప్రసార మాధ్యమాలు తాము ఇదివరకెన్నడూ ఇంత పెద్ద ర్యాలిని చూడలేదన్నారు. సాధారణంగా ప్రసార మాధ్యమాలు ఇటువంటి ర్యాలీలను పట్టించుకోవు. కానీ ఈ సారి అలా విస్మరించను సాధ్యపడలేదు. సామాజిక మాధ్యమాలు, టి.వి.లు విస్తృతంగా ప్రసారం చేసాయి. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారి కార్మిక కర్షక వ్యవసాయకూలి సంఘాలు అన్నీ కలిసి తమ ఐక్య స్వతంత్ర కార్యక్రమం నిర్వహించడం ఇదే తొలిసారి. ఇదివరకంతా అన్ని సంఘాలు తమతమ ర్యాలీలు జరుపుకున్నాయి. అన్ని కలిసి ప్రదర్శన నిర్వహించడం మాత్రం ఇదే ప్రథమం. పేద ప్రజల ఐక్యతను నిర్మించడానికి పెద్ద ఎత్తున సన్నాహాలు చేసాం. దీనిపై ఆధారపడి మనం సామాజిక మార్పు కోసం భవిష్యత్తులో బలప్రదర్శన చేయాల్సి ఉంటుంది. మూడు సంఘాలు ఈ పోరాటం నిర్వహించడంలో ప్రముఖ పాత్ర పోషించినట్టే, మహిళలు, విద్యార్థులు, యువతి యువకులు ప్రదర్శనలో పాల్గొనడానికి ఉత్సాహాన్ని చూపారు. ఫలితంగా మధ్యతరగతివారు, విద్యార్థులు యువతి యువకులు పెద్ద ఎత్తున ప్రదర్శనలో పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 22వ మహాసభ ఈ ప్రయత్నాలను స్వాగతించింది. దీనిని దృఢపరచడానికి ఏర్పడ్డ విశాల "ప్రజా ఐక్యత, ప్రజా హక్కుల ఉద్యమ వేదిక" ఏర్పడడానికి మద్దత్తు తెలిపింది (జన్ ఏకతా, జన్ అధికారి అందోళన్ – జెఇజెఏఏ). ఈ ఉద్యమం విజయవంతమవడానికి పార్టీ మొత్తంగా కృషి చేయాలని

పిలుపునిచ్చింది. ఈ చారిత్రాత్మక విజయం అన్ని తరగతుల సమిష్టి కృషి వలెనే సాధ్యపడింది. దీని ఆధారంగానే కార్మిక కర్షక మైత్రిని బలపరచవలసి ఉంటుంది. ఈ బాధ్యత పార్టీలోని అన్ని స్థాయిలలో పనిచేసే వారిపై ఉంది. కేంద్ర నాయకత్వం చైతన్యపూరితంగా ఈ పనిలో నిమగ్నమై ఉంది. ఇప్పుడు ఈ సంఘాల రాష్ట్ర, జిల్లా, ప్రాంతీయ, యూనిట్ నాయకత్వం కలిసి పనిచేసేందుకు కృషి చేయాల్సి ఉంది. మనం మనలో గతంలో ఉన్న విముఖత, బలహీనత, అహంకారం, అంటీముట్టనట్టు ఉండే పద్ధతుల నుండి బయటపడాలి. ఒకరిపై ఒకరు నమ్మకంతో, సహకారంతో పని చేయాలి. సిఐటియూ, కిసాన్ సభ, వ్యవసాయ కూలి సంఘాలు అంకిత భావంతో ఈ పని చేయాలి. పార్టీ కూడా ఈ ప్రయత్నానికి సంపూర్ణ మద్దత్తు నివ్వాలి. అప్పుడే పార్టీ కార్యక్రమంలో చెప్పిన విధంగా కార్మిక కర్షక ఐక్యత సాధ్యపడుతుంది.

ఈ కార్యక్రమంలో ఈ మధ్య జరుగుతన్న పురోగతిని చెప్పి నేనీ వ్యాసాన్ని ముగిస్తాను. గత కొన్ని సంవత్సరాలుగా ఈ మూడు సంఘాల కేంద్ర నాయకత్వం ఐక్య కార్యాచరణలకు పిలుపుల నిచ్చింది. ఏంతో ఘనమైన విజయాలు సాధించాం. ముఖ్యంగా రాష్ట్ర జిల్లా నాయకత్వాన్ని ఈ విషయంలో చురుకుగా పనిచేసేటట్టు చేయగలిగాము. గతంలో ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మెలు చేసారు. ఇప్పుడు ఇటువంటి ప్రతి సమ్మెకి కిసాన్ సభ, వ్యవసాయ కూలి సంఘం మద్దతు నివ్వడమే కాదు తాము కూడా 'గ్రామా భారతి' వంటి పిలుపులను ఇస్తున్నాయి. దాని వల్ల పోరాటాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. అందువల్ల ఐక్య కార్యాచరణాలు కొనసాగుతున్నాయి, బలపడుతున్నాయి. మోడీ ప్రభుత్వం రెండో దశ మొదలైంది. మనం మన సంయుక్త ఉద్యమ కార్యక్రమాలు – పారిశ్రామిక సమ్మె, గ్రామ బంద్ – చేసాము. ఇవి విజయవంతంగా నిర్వహించబడ్డాయి. కానీ, ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాల అమలు మరింత తీవ్రతరం చేసింది. ఫలితంగా గత ఏడు దశాబ్దాలలో జరగనన్ని పోరాటాలు ఈ కాలంలో జరిగాయి. కష్టపడి సంపాదించుకున్న 44 కార్మిక చట్టాలు కార్పొరేట్ల ప్రయోజనం కోసం పాతరేయ (రద్దు చేయ) బడ్డాయి. వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్ (చట్టాలు) అవతరించాయి. పని హక్కు, సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు, ఎనిమిది గంటల పని, స్థిరమైన పని, సెలవు తీసుకునే హక్కు, బోనస్ పొందే హక్కు, ప్రోవిడెంట్ ఫండ్, పెన్షన్ పొందే హక్కులు పూర్తిగా తొలగించబడ్డాయి; లేదా పరిమితులు విధించబడ్డాయి. అదే సమయంలో

యజమానులకు ఇష్టమైనప్పుడు కార్మికులను తొలగించే హక్కు, పరిశ్రమలను మూసివేసే హక్కు, కార్మికుల జీతాలను తగ్గించే హక్కు, లేదా వారి ఆర్థిక ప్రయోజనాలను వెనక్కు తీసుకునే హక్కు ఇవ్వబడింది. స్థిరమైన ఉద్యోగాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. కాంట్రాక్టు కార్మికులను నియమించుకోవచ్చు. అందువలన ఈ నాలుగు కోడ్లను కార్మిక కోడ్లనడం కంటే కంపెనీ కోడ్లనడం సరైనది. ఇవన్నీ నయా – ఉదారవాద విధానాల అమలులో భాగమే. అంటే కార్పొరేట్లకు సంపూర్ణ స్వేచ్ఛను కలిగించడమే. కార్మిక సంఘాలు – పది కార్మిక సంఘాల ఐక్య వేదిక – వీటన్నిటికీ వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నది. కిసాన్ సభ, వ్యవసాయ కార్మిక సంఘం వారికి అండగా నిలుస్తున్నాయి. కర్షకులను కూడా వారివైపు నిలుపుతున్నాయి. మరో వైపు మోడీ ప్రభుత్వం దేశంలో ఉన్న లాక్‌డౌన్‌న్ను ఆసరాగా చేసుకుని, అర్ధరాత్రివేళ మూడు నల్ల చట్టాలను తెచ్చి, రైతాంగానికి మరణ శాసనం విధించింది. ఈ మూడు చట్టాలు పార్లమెంటులో అప్రజాస్వామికంగా, రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేయబడ్డాయి. మొదటి రోజు నుండి ఏఐకెఎస్ ఈ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నది. మొదట ఏఐకెఎస్ ఈ ఆర్డినెన్స్ ప్రతులను కాల్చమని పిలుపు నిచ్చింది (అవి పార్లమెంటుకి రాకముందు. మోడీ తొందరపాటుతో ఈ చట్టాలను ఆర్డినెన్స్‌లుగా తెచ్చారు). దేశవ్యాప్తంగా రైతులు అనేక ప్రాంతాలలో తమ నిరసనను తెలియచేసారు. ప్రభుత్వం నిరసనలను గానీ, చట్టాలు అమలు చేయవద్దని పెట్టుకున్న పిటిషన్లను గానీ పట్టించుకోలేదు. మంద బలంతో చట్టాలను చేసేసింది. ఈ చట్టాల ప్రధాన ఉద్దేశం వ్యవసాయాన్ని వాణిజ్యపరం చేయడమే. అంటే దేశంలోని వ్యవసాయ విధానం రైతుల మీద కాకుండా కొర్పొరేట్ల మీద, అంటే అంబానీ అదానీల మీద ఆధారపడి ఉండాలి. రైతు తన భూమిని వదులుకోవలసి పరిస్థితి వస్తుంది. లేదా తన భూమిలోనే తాను బానిసగా బతకాల్సి వస్తుంది.

రైతులకు గిట్టుబాటు ధర అందడం లేదు. భవిష్యత్తులో తక్కువ ధరకి పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతాయి. సరుకులను నిల్వ చేయడం, నల్ల బజారులో అమ్ముకోవడం పెరుగుతుంది. ప్రజాపంపిణీ వ్యవస్థ చల్లగా అదృశ్యమవుతుంది. ఫలితంగా కోట్లాది కార్మికులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు, పేద, భూమిలేని రైతులు, మధ్యతరగతికి చెందిన ఉద్యోగులు, ప్రజాపంపిణీ వ్యవస్థపై ఆధారపడి బతుకుతున్నవారు, ఆకలితో అలమటించవలసి వస్తుంది. ఆ మూడు

నల్ల చట్టాలు దేశంలోని రైతాంగం, శ్రమజీవుల జీవితాలను కష్టాలలో ముంచెత్తుతాయి. అందువలన కిసాన్ సభ, వ్యవసాయ కూలి సంఘం ఈ నల్ల చట్టాలను సమూలంగా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. మన దేశంలో అఖిల భారత కిసాన్ పోరాట సమన్వయ కమిటీ 250 చిన్నా పెద్దా రైతు సంఘాల కలయికతో ఏర్పడింది. మరో 200 రైతు సంఘాలు ఈ ఉద్యమంలో చేరాయి. ఫలితంగా ఈ సంస్థలన్నీ కలిసి సంయుక్త కిసాన్ మోర్చాగా ఏర్పడి ఈ పోరాటాన్ని నడుపుతున్నాయి. హర్యానా, ఉత్తర్ ప్రదేశ్‌లతో కలిసి పంజాబ్ ఈ ఉద్యమానికి ముందున్నది. అయితే ఈ ఉద్యమం ఐక్య ఉద్యమం. దేశవ్యాప్తంగా లక్షలాది రైతులు పాల్గొంటున్న ఉద్యమం. ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణచడానికి ఎన్నో పన్నాగాలు పన్నింది. కానీ రైతులు ఆ అడ్డంకులనన్నిటిని అధిగమించి ఢిల్లీ చేరాలని ప్రచారం చేసారు. ప్రభుత్వం వారిని ఆపాలని దుర్మార్గమైన అనేక రకాల పాశవిక దాడులు చేసింది. ప్రభుత్వం ఢిల్లీ సరిహద్దులలో అడ్డంకులు పెట్టింది. అందువల్ల ఢిల్లీ చుట్టూ ఉన్న హైవే పై రైతులు బైఠాయించారు. వేలాది రైతులు ఇంకా ఆ ఐదు ప్రాంతాలలోనే ఉండాల్సి వస్తున్నది. చలి వాతావరణంలో ఉష్ణోగ్రత దాదాపు సున్నాకి చేరుకున్నప్పుడు కూడా రైతులు అక్కడి నుండి కదలలేదు. వానలు పడడంతో వారి కష్టాలు మరింతగా పెరిగి తారాస్థాయికి చేరుకున్నాయి. రోజుల తరబడి వానలో తడవాల్సి వచ్చింది. ఇప్పటికే 600 మందికి పైగా రైతులు మరణించారు. కానీ ఫాసిస్టు తరహా, అమానుష, అప్రజాస్వామిక మోడీ ప్రభుత్వం వారి డిమాండ్లను అంగీకరించడానికి సిద్ధంగా లేదు.

ఏమైనప్పటికీ, రైతులు తమ డిమాండ్లను ప్రభుత్వం తీర్చకుంటే ఇళ్లకు వెళ్ళేది లేదని పట్టుదలతో ఉన్నారు. ప్రభుత్వం 7 దఫాలుగా చర్చలు నడిపింది. అన్ని సార్లూ విఫలమైంది. ప్రభుత్వం రైతులపై కక్ష కట్టింది. వారిని బలవంతంగా అయినా ఇళ్లకు పంపాలనుకుంటున్నది. కానీ మోడీ ప్రభుత్వం రైతుల పట్టుదలను గ్రహించడం లేదు. వారు కదలిపోవచ్చు. కానీ వెనక్కు వెళ్లరు. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో జరిగిన అతి పెద్ద రైతు ఉద్యమం ఇదే.

అత్యంత శాంతియుతంగా, అహింసాయుతంగా జరిగే ఉద్యమం కూడా ఇదే. ఈ ఉద్యమం చారిత్రాత్మిక ప్రజాతంత్ర ఉద్యమం. దేశవ్యాప్తంగా లక్షలాది మంది దీనికి మద్దత్తు పలుకుతున్నారు. కార్మిక వర్గం ఈ ఉద్యమానికి తన సంపూర్ణ మద్దత్తు ప్రకటించింది. సిఐటియూ ఈ ఉద్యమంతో మొదటి నుండి కలిసి నడుస్తున్నది.

రైతాంగం డిమాండ్లతో పాటు కార్మికుల డిమాండ్లను కూడా జతచేసి పోరాటాలు చేస్తున్నది. పది కేంద్ర కార్మిక సంఘాలు ఉమ్మడిగా ఈ ఉద్యమానికి మద్దత్తునిచ్చాయి. కార్మిక వర్గాన్ని ఈ ఉద్యమంలో ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చాయి. ఎన్నో ఉద్యోగ సంఘాలు, సామాజిక సంస్థలు, మహిళలు, విద్యార్థులు, యువకులు, ఈ ఉద్యమానికి మద్దత్తు నిచ్చారు. వామపక్ష మేధావులు, అభ్యుదయవాదులు, కళాకారులూ, రచయితలూ, కవులు, నాటక రచయితలూ, నటులు ఈ ఉద్యమానికి హృదయ పూర్వకంగా మద్దత్తు తెలిపారు. మద్దత్తునిచ్చి, సంఘీభావం తెలిపిన వీరందరికి రైతు సంఘాలు కృత్ణతలు తెలియచేసుకుంటున్నాయి. ముఖ్యంగా కార్మిక సంఘాల మద్దత్తు మాకు అత్యంత కీలకం. కార్మికులు మా పోరాటాల్లో పాల్గొంటున్నారు. ప్రచారాలు చేస్తున్నారు. మాకు మద్దతుగా ప్రజాభిప్రాయాన్ని మలుస్తున్నారు. ఢిల్లీలో రైతులకి మద్దతుగా పెద్ద పెద్ద ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించబడుతున్నాయి. అనేక రాష్ట్రాలలో ఉద్యమానికి మద్దతుగా నిధులు సేకరిస్తున్నారు. మా డిమాండ్లను తెలియచేస్తూ కరపత్రాలను పంచుతున్నారు. సెప్టెంబర్ 25 – ప్రతిఘటన దినం – రైతులు పిలుపునిచ్చిన నిరసన ప్రదర్శనలో అనేక మంది కార్మికులు పాల్గొన్నారు. డిసెంబర్ 25న జరిగిన భారత్ బంద్ పిలుపులో కూడా కార్మికులు ప్రధానమైన పాత్రను పోషించారు.

అందువలన కార్మికుల పోరాటాలు కార్మిక కర్షక ఐక్యతను నిర్మించడంలో ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ ఐక్యత మరింత స్థిరపడాల్సిన అవసరం ఉంది.

చివరిగా, కార్మిక కర్షక ఐక్యత, ఒక చారిత్రిక రాజకీయ వేదిక. కార్మిక కర్షకుల విప్లవాన్ని నిర్మించడం దీని ప్రధాన బాధ్యత. కార్మికుల నాయకత్వాన ఉండే ఈ మిత్రత్వం, మనిషిని మనిషి దోచుకోని ఒక స్వేచ్ఛాయుతమైన సమాజం నిర్మించడానికి ఒక సమర్థవంతమైన పనిముట్టుగా ఉపయోగపడుతుంది. సోషలిజం అంటే ఒక నాగరీకమైన, మానవత్వంతో నిండిన దోపిడీ లేని సమాజం. ఇటువంటి అద్భుతమైన సమాజ నిర్మాణమే మన అంతిమ లక్ష్యం. ఈ దేశంలోని శ్రమజీవులు ఎన్నో సంవత్సరాల నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజాతంత్ర సమాజాన్ని నిర్మించడానికి పోరాటాలు చేస్తూనే ఉన్నారు. కార్మిక కర్షక ఐక్యత ఈ లక్ష్య సాధనకు ప్రయోజనకరంగా ఉంటుంది.

వర్గ పోరాటాల ఆధారంగా ఇప్పుడు ఏర్పడ్డ వేదిక ఇది. ఈ రెండు మౌలిక వర్గ తరగతుల ఐక్యత కార్మిక వర్గం నాయకత్వాన నిర్మించబడుతుంది.

అందువల్ల ఈ రెండు తరగతులను వారి వారి వర్గ సంఘాలు నిర్మిస్తూనే, నిరంతర పోరాటాల ద్వారా వారిలో మిత్రత్వం పెంపొందానికి కృషి చేయాలి. కార్మిక కర్షక వర్గ ఐక్యతే అంతిమ లక్ష్యంగా చేసుకుని, అందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు మనస్ఫూర్తిగా చేయడమే మన బాధ్యత.

కార్మికుల నాయకత్వాన ఉండే ఈ మిత్రత్వం, మనిషిని మనిషి దోచుకోని ఒక స్వేచ్ఛాయుతమైన సమాజం నిర్మించడానికి ఒక సమర్థవంతమైన పనిముట్టుగా ఉపయోగపడుతుంది. సోషలిజం అంటే ఒక నాగరీకమైన, మానవత్వంతో నిండిన దోపిడీ లేని సమాజం. ఇటువంటి అద్భుతమైన సమాజ నిర్మాణమే మన అంతిమ లక్ష్యం. ఈ దేశంలోని శ్రమజీవులు ఎన్నో సంవత్సరాల నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజాతంత్ర సమాజాన్ని నిర్మించడానికి పోరాటాలు చేస్తూనే ఉన్నారు. కార్మిక కర్షక ఐక్యత ఈ లక్ష్య సాధనకు ప్రయోజనకరంగా ఉంటుంది.

**హన్నన్ మొల్లా**

PSBH
ప్రజాశక్తి బుక్‌హౌస్